ఈ వారం కథ

# అడవి మనిషి

పుప్పాల కృష్ణమూర్తి

"గిక్కడ గూసుందునా దొరా!" పక్కకొచ్చి అడిగాడు. తలెత్తి ముఖం చూశాను. అరనైకి అటూ, యిటూ ఉంటాయనిపించింది. దేహం చూస్తే మాత్రం దృఢంగా నలభైయేళ్ళ వాడ్లా వున్నాడు. పిడికెడున్నాయి తెల్లని వెండి మీసాలు. మెళ్ళో పెద్ద వెండి కంటె. చెవులకు యిత్తడి పోగులు. తలకో పెద్ద ఎర్రగమ్మల రుమాలు. భుజాన గొంగడి. మొలకో ముతక ఎర్రంచు పంచె. చేతిలో దుడ్డుకర్ర. చేతులకున్న వెండి మురుగులు, దండ చేతికి వెండి కడియాలు ఎండకు మెరుస్తున్నాయి. ఐదున్నరడుగుల ఎత్తుతో, ఎత్తుకు తగ్గ లావుతో అందంగా కనిపించాడు నా కళ్ళకు. ఎర్రటి ముఖంలో పల్లెటూరి అమాయకత, ప్రశాంతత కనిపిస్తున్నాయి.

కూర్చోమన్నాను పక్కకు జరుగుతూ.

కిర్రుచెప్పులిడిసి, జాగ్రత్తగా పక్కకు పెట్టుకుంటూ కూర్చున్నాడు. 'అమ్మలింగా' అంటూ .

నాకు ఎడం పక్కలో పల్లెటూరి యువకుడు గభాల్న వచ్చి కూర్చున్నాడు. గ్లాస్కో పంచె, సిల్కు చొక్కా, మెళ్ళో దస్తీ నోట్లో పాను, చేతిలో సిగరెట్టు. పట్టణ నాగరికతని యిప్పుడిప్పుడే అనుకరిస్తున్న వాడ్లా వున్నాడు. మనిషి పుష్టిగా వున్నాడు. ఆరడుగుల ఎత్తుతో. ముప్పైకి రెండు, మూడేళ్ళు తక్కువగానే ఉన్నట్లనిపించింది. అతని పక్కనో యిద్దరు కాలేజీ స్టూడెంట్లొచ్చి కూర్చున్నారు. కుర్రాడు చాలా ఎమోషనల్‌గా, తను చూసొస్తున్న సినిమాలో హీరో చేసిన ఎడ్వంచర్స్ గురించి చెబుతుంటే, కాలేజీ కుర్రాళ్ళతనికి తెలియని యాక్టర్ల పేర్లు చెబుతున్నారు. నేనో చెవి వాళ్ళవైపు పడేసి, వీక్లీ తీసి కార్టూన్లు చూడసాగాను. పాను నములుతున్నతని పేరు సీతరాములని స్టూడెంట్లిద్దరూ శేషిరెడ్డి, రాఘవాచారని తెలిసింది వాళ్ళ మాటల్లో.

టాప్ మీద కూడ జనం బాగా నిండి పోవడంతో బస్సు మెల్లగా కదిలింది. మూల మీదున్న నలుగురు చేతులెత్తే సరికి సర్వీసు నాపాడు. క్లీనరు దిగి, లోపలి వాళ్ళను జరుపుతూ, కిందున్న వాళ్ళను ఎక్కిస్తున్నాడు.

"యింకెడెక్కిస్తవాయ్. యిప్పటికే పిక్కటమైతే" పైనుంచి అరిచాడు సీతరాములు.

"ఎక్కనియ్యి మనవడా! అందరం బొవ్వాలె గదా" అన్నాడు తాత శాంతంగా

"నీ మీదెక్కిస్తే సరిపోద్ది... హూ(.... ఏం బస్సురా బాబు" రాఘవాచారి విసుక్కున్నాడు.

"బస్సు కాదురా యిది. ఎడ్లబండి" అన్నాడు శేషిరెడ్డి.

ముగ్గురూ నవ్వారు.

"దొరా! గీ బస్సు గొర్లపాలెం బోద్ది గదా" అన్నాడు నా పక్కనున్న తాత.

"గొర్లపాలెం బోదు. గంపలగూడెం దిగి నడిచి పో" అన్నాను.

"గట్లనేలే! వచ్చేటప్పుడు గూడా గట్టనే నడ్సొచ్చిన" అన్నాడు.

"ఓ బోయుడా! ఏ ఊరునుంది? "అన్నాడు సీతరాములు హాస్యం పట్టిస్తూ.

"గొర్లపాలెం......" అన్నాడు

"అనుకున్నా! నిన్ను చూడంగనే. అదే ఊర య్యింటుందని.... అనుకున్నా" సినిమా డైలాగ్‌లాగా అనే సరికి ముగ్గురూ విరగబడి నవ్వారు.

"అబ్బ...! ఎక్కడోడురా బాబూ!.... కొండమనిషి' అన్నాడు రాఘవాచారి తల కొట్టుకుంటూ.

"కొండ కాదురా, అడవి... అడవిమనిషి" అన్నాడు శేషిరెడ్డి.

ఒకళ్ళమీదొకళ్ళు ఒరుగుతూ నవ్వుకోసాగారు తాత మీద జోకును అమాయకత్వానికి.

అంతలో కండక్టర్ పైకొచ్చి "టికెట్.... టికెట్" అన్నాడు గట్టిగా.

"సీతరాములు వందనోటిచ్చి "సినాం పురానికి మూడియ్యి" అన్నాడు.

"చిల్లర లేదు. ఆరుముప్పావలా యియ్యండి" అని నావైపు చేయి చాచాడు. రెండు రూపాయలిచ్చి టికెట్ తీసుకున్నాను.

"అందుకు చిల్లర లేనోడివి. నువ్వేం కండక్టర్‌వాయ్?" అని దబాయించసాగాడు సీతరాములు.

"సరే! ఆనోటు యిటియ్యి" అని తీసుకుని, మూడు టికెట్లు చించి వెనకాల పెన్సిల్‌తో రాసి "దిగేప్పుడు తీసుకోండి" అన్నాడు.

"దిగేప్పుడు గుర్తుండదు. యిప్పుడియ్యాల్సిందే" వాగ్యుద్ధం వేసుకున్నాడు. అతనికి మద్దతుగా స్టూడెంట్స్. గొడవ మొదలయ్యింది.

"లేందే, ఎలా యిస్తారు చెప్పండి? మీరు కండక్టరయినా అదే పరిస్థితి" అని నేను, మా ఊరు ప్రసాదరావు గారూ సర్ది చెప్పడంతో ఆగిపొయ్యారు.

"టికెట్ తాతా!" లింగయ్యను అడిగాడు.

"అరె ఉండరా మనవడా! యిస్తు తున్నా.... అని పంచెకు ఓ చివర్న, గట్టిగా ముడికట్టి, మొలలో దోపిన చిన్న మూటను బైటికి తీశాడు తలవంచి ఒక్కో ముడే విప్పసాగాడు.

ఆ విప్పేతీరు జూస్తుంటే నాకూ నవ్వొచ్చింది. వెంటనే చింతామణి నాటకం జ్ఞాపకమొచ్చింది. శ్రీహరికాడ సుబ్బిశెట్టి, పంచె కొంగున వున్న రూపాయి యివ్వడానికి, బిగించి కట్టిన ముప్పైముళ్ళు అర్థగంట విప్పి, పదిసార్లు 'రూపాయిస్తున్నా... రూపాయి' అని విచారంగా యివ్వడం చింతామణి తల్లి తీసుకోవడం... పక్కవాళ్ళు లింగయ్యను చూసి నవ్వుకోసాగారు.

"నితో పెట్టుకుంటే యియ్యాల అయినట్లే! తొందరగా తియ్యి" అని ముందుకు పొయ్యి, యిరవై మందికి టికెట్లిచ్చి తిరిగొచ్చాడు.

దగ్గరకొచ్చిన కండక్టర్‌ని చూసి "మా ఊరికో టిక్కటియ్యి" అన్నాడు ఒక్కో నాణాన్ని పరీక్షగా చూసి లెక్కపెడుతూ.

"ఏ ఊరుమీది" విసుగ్గా అన్నాడు కండక్టర్.

"పొద్దుగాల ఎక్కినప్పుడు టిక్కటిస్తివిగా?.?" అన్నాడు అతనివైపు చూస్తూ.

"రోజూ సవాలక్ష మందెక్కుతారు. ఎక్కడ గుర్తుపెట్టుకుంటామయ్యా?... ఏ ఊరో చెప్పు?" అన్నాడు కోపం, అసహనం కలిసిన కంఠంతో.

"గంపలగూడెం ఎంబడి గొర్లగూడెం" అన్నాడు చిల్లర నావైపు చూపుతూ.

టికెట్ చింపి,చేతిలో కుక్కుతూ, "రెండ ముప్పావలా యియ్యి"అన్నాడు. రెండుసా సరి చూసి, నేను కూడా సరిగ్గానే వున్నా న్నాక డబ్బులిచ్చాడు.

"నీలాంటోళ్ళు నలుగురెక్కాలి. సామిరంగా... యియ్యాల మేం పెండ్ల పిల్లల్ని చూసుకునే పనుండదు" ఎస్సా నింపుకుంటూ అన్నాడు కోపం, విసు మిళితమైన స్వరంతో.

"ఈ ఈడు పిల్లగాల్లకి ఓపిక లేకు దైతాంది" అంటూ మిగిలిన చిల్లర పైసల్ని టికెట్‌ని పంచె కొంగున కట్టసాగాడు. వాళ్ళంతా వింతగా చూడసాగారతన్ని. అత దేవీ పట్టించుకోకుండా. తలకున్న పెద్ద రుమా ల్లోంచి, సగం కాల్చిన చుట్టతీసి, నాలుకతో చుట్టను మొత్తం ఓసారి తడిపి, నోట్లో పెట్టుకుని, 'ఉప్ప.... ఉ..ప్ప'ని అటూ, యిటు ఊది నోట్లో పెట్టుకున్నాడు. రుమాల్లోంచి తోలుసంచి తీసి, కండవ చెంగు చాటు చేసుకుని, చెకుముకిరాయి కొట్టి లేచిన రవ్వతో దూది అంటుకోగా, చుట్టకు అంటించాడు.

రెండు దమ్ములు లాగాడో లేదో "అబ్బా ... కంపు! చుట్టకంపులు నాకు పడదు. వాంతైద్ది... ఆర్పేయ్... ఆర్పేయ్..." అని చుట్టలాక్కున్నంత పని చేశాడు శేషిరెడ్డి.

"నువ్వు ఆర్పకపొయ్యావో, నీ చుట్టనూ నిన్నూ యిక్కడ్నుంచి కిందికి యిసిరేస్తా" అన్నాడు సీతారాములు బెదిరిస్తున్నట్లు.

"ఆర్పుతలేరయ్యా! మీ ఒలిగె నాకు సిగిలేట్లు లెవ్వాయె."అన్నాడు చుట్టను ఎడంచేతి బొటనవ్రేలితో ఆర్పుతూ.

"యిదుగో కాల్చుకో!.... ఎప్పుడు మారతారో ఈ అడవి మనుషులు" అని శేషిరెడ్డి జేబులోంచి ఓ సిగరెట్టుతీసి యిచ్చాడు.

"ఒరేయ్.....! ముసలోడు ఫిల్టర్‌ను ముట్టిస్తాడేమోరా?"అన్నాడు రాఘవాచారి. చాలామంది నవ్వారు అతని జోక్‌కి.

సిగరెట్ తీసుకుని ఎడంచేతిలో సిగరెట్టుంచి, కుడిచేతి బొటనవ్రేలితో రెండుసార్లు బలంగా రుద్దాడు. ఫిల్టర్‌తోసహా సిగరెటంతా నుగ్గునుగ్గైంది. పొడువంతా దగ్గరికి వేలితో కొట్టి, మెల్లగా ఊదాడు. కాగితం ముక్కలు, దూది గాలికెగిరిపోగా, మిగిలిన పొగాకు పొడుంను నోట్లో పోసుకున్నాడు. పొగాకును చప్పరిస్తూ, పెదాలకు రెండు వేళ్ళు అడ్డం పెట్టుకుని, కిందికి ఉయ్యా సాగాడు.

అది చూసి చాలామంది అసహ్యంగా


ముక్కులు విరుస్తూ, కండ్లు చిట్లిస్తూ ముఖాలు తిప్పుకున్నారు.

లింగయ్య తాత నములుస్తూ ఊస్తూనే వున్నాడు.

ఉన్నట్టుండి 'ఢాం' మ్మనే శబ్దం వినిపిం చడంతో భయంతో అందరం బిగుసుకు పొయ్యాం. వెనక టైరు పేలింది.

డ్రైవరు మెల్లగా బస్సును తీసుకెళ్ళి రోడ్డు పక్కకు ఆపుచేశాడు.

''టైరు మార్చాలి దిగండి.....



బరెస్టయింది కింది నుంచి అరిచాడు క్లీనర్.

"పిడ్డి తన్నరసి. పగిలే టైరెందుకేసుకో వాల్రా నువ్వు'' పై నుంచే అన్నాడు సీతరా వులు. క్లీనర్ పట్టించుకోలేదు.

"ఏమైంది దొరా! మందంతా గిట్లలే స్తుంరు?'' అన్నాడు శాంతంగా.

"టైరు గాలిపోయింది. మార్చాలంట. కొద్దిసేపు కిందికి దిగు" అన్నాను లేస్తూ.

"అంతేలే! గాలుంటనే గదా జీవుడి బండి గూడా నడిసేది''నిట్టూరుస్తూ లేచాడు.

అందరం కిందికి దిగి పక్కనే వున్న మోరి (కల్వర్టు) మీద కూర్చున్నాం.

"అరే బామ్మర్ది. నీకు దమ్ముంటే, ఈ బండని, భుజం మీదికి లేపుకోరా'' అన్నాడు బక్కగా పొడుగ్గా వున్న నలభైయ్యేళ్ళ రైతు, లావుగా నల్లగావున్నతన్ని.

"దీన్ని ల్లే...పలేనారా?'' అని దీర్ఘంతీస్తూ నేలమీదున్న బండను మోకాళ్ళ దాకా లేపికిందపడేశాడు.

"కష్టం రాబావా! చానా బరువుంది'' అన్నాడు కండవతో, కారిన చెమటలు తుడ్చుకుంటూ రైతు.

"అరే శేషు. నువ్వు పట్టరా. నాకు చేతకాదుగని' రాఘవాచారి అన్నాడు.

శేషిరెడ్డి వంగి బలంకొద్దీ రెండు చేతులతో అమాంతం లేపబోయాడు. కాళ్ళ సందులోంచి పర్రుమని చినిగింది టైటు ప్యాంటు.

చుట్టూ నిలబడి చూస్తున్న ఆడా, మగ వాళ్ళంతా విరగబడి నవ్వుకున్నారు. పుస్తకాలు అడ్డం పెట్టుకుని బండి చాటుకుపొయ్యాడు.

"ఈ బండను లేపే దేవుందిరా? నేను మా ఊళ్ళొ పందెం గుండునే. లేపి యిసిరేసిన' అన్నాడు సీతరావులు దగ్గరికొచ్చి బండను కాలితో తంతూ.

నేనతని పర్సనాలిటీ చూసి తప్పక లేపుతాడనుకున్నా. పాను కాండ్రించి ఉమ్మేసి, పంచె కుచ్చిళ్ళు పైకి చెక్కుకున్నాడు. చొక్కా రెండు పై గుండీలు విప్పి చేతులు పైకి మడుచుకుని కిందికి వంగాడు. బండను అడ్డంగా పట్టి, పండ్లు గిట్ట కరిసి బలంకొద్దీ లేపాడు. పొట్టదాకా లేసింది. కండ్లు ఎర్రగా రక్తం కమ్మాయి. పైకి లేపాలని యింకెంత ప్రయత్నం చేసినా బెత్తెడుకంటే యింకే మాత్రం పైకి జరగలా. గబాల్నకింద పడేశాడు. "వామ్మో! యింగ నావల్లగాదు. అది వంద కేజీలకు పైనుంది" అన్నాడు పంచె చెంగుతో ముఖాన చెమట తుడ్చుకుంటూ.

"యిందాకట్నించీ తెగకోతలు కోస్తుం టివే. లేపవయితివే?" అన్నాడు మా ఊరి రైతు సత్యమయ్య.

"ఛాలెంజి! యిక్కడెవరూ దీన్ని లేపలేరు. నువ్వులేపు. వంద రూపాయలిస్తా'' అన్నాడు పౌరుషంగా జేబులోంచి వందకాగితం తీస్తూ.

"నాకే నీ అంత వయసుంటే, యింకో పెండ్లాన్ని జేస్కోపోయినాను'' అన్నాడు డెబ్బయ్యేళ్ళున్న సత్యమయ్య వ్యంగ్యంగా.

అందరూ ఫెడేల్మని నవ్వారు. సీతరా వులు ముఖం మాడిపోయింది.

"లేపితే, వందిస్తవా?'' అన్నాడు లింగయ్య తాత జనంలోంచి మధ్యకొస్తూ.

"అరే.....! మన లింగయ్య లేపుత డంటరో.....! సూడు. తాతో నువ్వు లేపితే రెండొందలిస్తా!'' అన్నాడు ఎగతాళిగా నవ్వుతూ.

"పందెం బెట్టినోడివి, నీ దగ్గరెందుకురా మనవడా డబ్బులు. ఈ పెద్ద మనిషికెయ్యి' అన్నాడు.

సీతరావులు రెండు వంద కాగితాలు నాచేతిలో పెట్టాడు.

"అందరూ జరంత దూరం జరగం డ్రయ్యా!'' అని జనాన్ని వెనక్కి జరిపాడు.

చెప్పులిడిసి, గొంగడి పక్కన్నేబెట్టి, దానిమీద దుడ్డుకర్రపెట్టి రుమాలును కూడా తీసి వాటిమీద పెట్టాడు. తలమీంచి మూరెడు పొడుగున వేలాడ్తోంది జడ. చివర్న ముడి. జడను రెండు చేతులా అందుకుని దగ్గరకు ముడేసి, పంచె గట్టిగా బిగదీసి కట్టి, దానిమీ దున్న వెండి మొలతాడును బిగించిపెట్టాడు. ఒంటిమీద ఒక్క పంచె తప్ప యింకేమీలేదు. యవ్వనంలో మంచి బలశాలి అనుకునేం దుకు గుర్తుగా ఒంటిమీద ఒంపులు తిరిగిన కండరాల గుర్తులు కనిపిస్తున్నాయి. ఎదు ర్రొమ్ము దట్టంగా అల్లుకున్న తెల్లటి వెంట్రుకల్తో విస్తరించి విశాలంగా వుంది. కొన్ని దశాబ్దాలుగా అతన్ని జబ్బు సోకన ట్లుగా వుంది శరీరం దృఢంగా.

"నువ్వోడిపోతే ఏమిస్తవు తాతా'' అన్నాడు ముందుకొచ్చి ముఖంలోకి చూస్తూ వెక్కిరింపుగా.

"సుట్టకు పువ్వాకుబెడలా'' అన్నాడు అంతా అతని హాస్యానికి పగలబడి నవ్వారు.

మధ్యలో నిటారుగా నిలబడితే, కుస్తీ పోటీలకోసం గోదాలో నిలబడ్డ ముసలి వస్తా దులా అనిపించాడు నా మనసుకు. జనమంతా ఆసక్తిగా, నిశ్శబ్దంగా చూడసాగారు. వంగి, బండను రెండు చేతులూ తాకి కళ్ళకద్దు కున్నాడు. తర్వాత బండను ఒక్క కుడిచేత బలంగా పక్కకు లాగాడు ఎదురు అంచు పట్టుకుని , బండమూరెడు దూరం జరిగి అతని కాళ్ళ దగ్గరికొచ్చింది. బండను రెండు చేతులతో పట్టి ఒక్కకోనుమీద నిలబెట్టాడు. మూడు కోనులు గాల్లో వున్నాయి. ఎడం వైపున్న కోనుకు కాస్తకిందివైపు పట్టి, కుడివైపు కోనుపైన కుడిచేతబట్టి, కాస్త ఊపి చూశాడు. చతురస్రాకారపు బండ ఊగింది.

ఉన్నట్లుండి, అమాంతం, "ఓ లింగా'' అని అరిచి, రాయిని ఎదుర్రొమ్ము మీదకు లేపాడు. అక్కడో రెండు క్షణాలాపి అమాం తం కుడి భుజం మీది నుంచి వెనక్కి విసిరేశాడు. అంతా క్షణాల్లో జరిగిపోయింది.

మేమంతా నోళ్ళు వెళ్ళబెట్టి అలాగే చూస్తుండిపోయాం, అతని బలాన్ని, ఒడుపుని ఆశ్చర్యంగా.

దొరా! పందెం డబ్బు తియ్యి అనగానే ఈ లోకంలో కొచ్చి రెండొందలూ అతని చేతుల్లో పెట్టాను. పంచె కొంగున కట్టుకొని దాని మీదో నాలుగు ముళ్ళేసి, బొడ్లో దోపుకు న్నాడు. అందరూ ఆశ్చర్యంగా వింతగా అతనుచేసే పనిని చూస్తున్నారే కాని నవ్వడంలేదు. యిందాక టిక్కెట్టుకు డబ్బు లివ్వుతుంటే సుబ్బిశెట్టితో పోల్చుకుని నవ్వుకున్న నేను, అతని వ్యక్తిత్వం ముందు మరుగుజ్జులా ఫీలయ్యాను. అప్పటి నా ప్రవర్తన పట్ల అసహ్యమేసి సిగ్గుతో తలవంచుకున్నాను.

"ఏ ఊరు తాతా? .... ఏంపేరు? '' అని చాలామంది గౌరవంగా అడుగుతున్నారు రెండు చేతులతో రుమాలు చుట్టుకుం టున్నవాడ్ని.

" గొర్లపాలెంమాది..... '' అన్నాడు అదే అమాయకతతో గర్వం లేకుండా.

" టైరు మార్చడం అయిపోయింది. బస్సెక్కండి'' క్లీనర్ కుర్రాడు అరవడంతో గబగబా పైకెక్కేశాము.

యిందాక అతన్ని వింత మృగంలా, అడవి మనిషిలా చూసి నవ్వుకున్నవాళ్ళంతా అద్భుతంగా, ఆరాధనగా చూస్తున్నారతని వైపు. అతనెవరి ప్రశంసల్నీ పట్టించుకోకుండా , రుమాల్లోంచి పొగాకు కాడతీసి, చేతిలో పొడుంచేసి, నోట్లో పోసుకొని నవుల్తున్నాడు.

"నేనాచ్చేప్పుడు మూసంటిదానికి జొరంగా వుంది. ఎట్లుందో ఏమో?'' మెల్లగా గొణిగినట్లు అంటున్నాడు నా పక్కనేవున్న సీతరావులు. పక్కనున్న కాలేజీకుర్రాళ్ళిద్దరూ తోకతెగిన కోతుల్లా,అవమానంతో ఒక్క మాట కూడా మాట్లాడ్డంలేదు. ముగ్గురి ముఖాలు అవమానంతో వేగినట్లుగా వున్నాయి.

ఎవర్నీ పట్టించుకోకుండా, రెండు వేళ్ళుపెదాలమీద పెట్టుకుని, నమిలిన పొగాకును కిందికి దూరంగా ఊస్తున్నాడు

బస్సువేగంగా పరిగెడుతోంది మా గ్రామం వైపు.